జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 19 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**దమ్మపేట, ఆగస్టు 18(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మల్కారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే

మిగతా 5 లో...



# మణుగూరు ఐటీఐ-ఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణలు అభినందనీయం

- 119 అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు
- అత్యుత్తమ ఆవిష్కరణలకు అవార్డులతో పాటు ఉద్యోగ అవకాశాలు
- పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను కమర్షియల్ వెహికల్స్ గా అభివృద్ధికి సహకారం
- త్వరలో గిరిజన ప్రాంతాల్లో యువ రైతుల కోసం వ్యవసాయ కోర్సులు
- టాటా సంస్థ ద్వారా 100 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు
- టామ్ కామ్ ద్వారా జర్మనీ, జపాన్ లో ఉద్యోగ అవకాశాలకు చర్యలు
- ఐటీసీ సీఎస్ ఆర్ నిధులతో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు
- మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 18 ,(ప్రజాజ్యోతి)** మణుగూరు ప్రభుత్వ ఐటీఐ–అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు , భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐ–ఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి, ముందుగా విద్యార్థులు రూపొందించిన నూతన ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మంత్రి పరిశీలించి, పాత వాహనాల నుంచి విడిభాగాలను సేకరించి వాటిని పునర్వినియోగం చేస్తూ ఎలక్ట్రిక్ వాహనాలను ఏ విధంగా రూపొందించారు, తయారీలో ఉపయోగించిన సాంకేతిక విధానం, వాహనాల పనితీరు తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఐటీఐ–ఏటీసీ విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా రూపొందించిన వివిధ నూతన పరికరాలను కూడా మంత్రి పరిశీలించి విద్యార్థులను

మిగతా 2 లో...

# ప్రజా పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



- సామాన్యుడిగా పుట్టి అసమాన యోధుడిగా చరిత్రలో నిలిచారు: సినీ నటుడు సుమన్

**దమ్మపేట, ఆగస్టు 18(ప్రజాజ్యోతి):** సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించి, ప్రజల హక్కుల కోసం పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లిలో భరద్వాజ రాంబాబు అవీవ్ నర్సరీలో దమ్మపేట గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు సుమన్ హాజరై పాపన్న గౌడ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గౌడ సంఘం నాయకులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించి, నాటి మొగల్ చక్రవర్తుల నిరంకుశ పాలనకు, స్థానిక జమీందారులు, జాగీర్దారులు, భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన అసమాన యోధుడని కొనియాడారు. ఒక్కడితో ప్రారంభమైన ఆయన పోరాటం క్రమంగా పీడిత ప్రజలందరినీ ఏకం చేసి ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని గెరిల్లా పోరాటాలు

మిగతా 2 లో...

# ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి



- పాల్వంచ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం కలెక్టరేట్ , పాల్వంచ / ఆగస్టు 18,(ప్రజాజ్యోతి)** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ పోలీస్ స్టేషన్ ను మంగళవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన

మిగతా 2 లో...

# కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు

- దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి
- గురుకులాలు, పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- గిరిజన ప్రాంతాల్లో 124 ఐసోలేటెడ్ ఆవాసాలకు శాశ్వత త్రాగునీటి సౌకర్యం కల్పించాలి
- అమృత్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలి
- పీఎంఏవై, ఉపాధి హామీ పథకాల పెండింగ్ చెల్లింపులను త్వరగా పరిష్కరించాలి
- దిశా కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 18,(ప్రజా జ్యోతి)** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సర్వసభ్య సమావేశాన్ని మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లతో కలిసి నిర్వహించారు. ముందుగాగత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును సమావేశంలో పరిశీలించారు. ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, విద్య, ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, జాతీయ రహదారులు, స్వచ్ఛ భారత్ మిషన్, అమృత్ ల, తదితర కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు.ఈ సందర్భంగాఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రులకు అవసరమైన సిటీ స్కాన్ వంటి వైద్య పరికరాల కొనుగోలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. అవసరమైన వైద్య పరికరాల కోసం సంబంధిత ప్రజాప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను

మిగతా 5 లో...

## ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

అనంతరం అధికారులు, సిబ్బందితో స్టేషన్ లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ప్రాపర్టీ కేసులు, దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి, చోరీకి గురైన ఆస్తి రికవరీ దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్నవ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించే వారిని గుర్తించి వారికి డీ–అడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ తో పాటు నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.సైబర్ నేరాల ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్–112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, సాయి కిషోర్ రెడ్డి, విజయ ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహిస్తూ ప్రజల కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యం, త్యాగం, స్వాభిమానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువతకు తెలియజేసి, ఆయన చూపిన పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గౌడ్లకు ఎస్టీ హోదా కల్పించాలనే అంశంపై కూడా సుమన్ స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అపాయింట్ మెంట్ తీసుకుని ఏజెన్సీ గౌడ్లకు ఎస్టీ హోదా కల్పించే అంశంపై తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలగాని గవరయ్య, యార్లగడ్డ బాబు, యార్లగడ్డ ఈశ్వరరావు, లక్ష్మి నర్స్ గౌడ్, కాసగాని చెన్నారావు, కందుల సుబ్బారావు, పానుగంటి రాంబాబు, వీరంకి సత్తిబాబు, యార్లగడ్డ సూరిబాబు, యార్లగడ్డ ఏసు, చెన్నారావు, బంధం చెన్నారావు, రవి, బంధం శ్రీను, పర్సా అప్పారావు, మడిపల్లి పోలరావు, వెంకటేశ్వరరావు, ఈడా సత్యనారాయణ, చీపు జగన్ తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరు ఐటీఐ-ఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణలు అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి...)

అభినందించారు.మణుగూరు వంటి మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థులు తమ సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలు చేయడం అభినందనీయమని మంత్రి అన్నారు. పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలు రాష్ట్రంలోని ఇతర ఐటీఐ–ఏటీసీ విద్యార్థులకు రోల్ మోడల్ గా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసి కమర్షియల్ వెహికల్స్ గా రూపొందించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. విద్యార్థుల ఆవిష్కరణలు కేవలం ప్రాజెక్టులకే పరిమితం కాకుండా మార్కెట్ లో ఉపయోగపడే ఉత్పత్తులుగా రూపుదిద్దుకునేలా పరిశ్రమల సహకారంతో అవసరమైన అవకాశాలను కల్పిస్తామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 119 అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లను టాటా సంస్థతో కలిసి అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. టాటా సంస్థ తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఈ సాంకేతిక కేంద్రాల అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. పాత ఐటీఐల్లో కొనసాగుతున్న సంప్రదాయ కోర్సులతో పాటు పరిశ్రమలకు ప్రస్తుతం అవసరమైన ఆధునిక సాంకేతిక కోర్సులను ఏటీసీల్లో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.మణుగూరు ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు టాటా సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. సుమారు 100 మంది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టాటా సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు.రాష్ట్రంలోని 119 అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అత్యుత్తమ ఆవిష్కరణలు చేసే విద్యార్థులను గుర్తించి రాష్ట్రస్థాయిలో పోటీ నిర్వహిస్తామని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అవార్డులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మణుగూరు విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలు ఇలాంటి ఇన్నోవేషన్ కు మంచి ఉదాహరణ అని అన్నారు.త్వరలోనే మారుమూల గిరిజన ప్రాంతాల్లో యువత, యువ రైతుల కోసం వ్యవసాయ రంగానికి సంబంధించిన ఆధునిక సాంకేతిక కోర్సులను కూడా ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు.విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ను కూడా అభివృద్ధి చేసుకోవాలని మంత్రి సూచించారు. మంచి నైపుణ్యాలు కలిగి ఉంటే దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఉద్యోగాల కోసం తమ ప్రాంతానికే పరిమితం కాకుండా ఎక్కడ అవకాశాలు ఉంటే అక్కడికి వెళ్లి పనిచేసే స్ఫూర్తిని యువత పెంపొందించుకోవాలని సూచించారువిదేశాల్లో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టామ్ కామ్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ అందించి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం టామ్ కామ్ కు రూ.90 కోట్లు కేటాయించిందని తెలిపారు. జర్మనీ పర్యటన సందర్భంగా అక్కడి ప్రతినిధులతో చర్చలు జరిపినప్పుడు తెలంగాణ నుంచి శిక్షణ పొందిన యువతను పంపిస్తే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వారు ముందుకు వచ్చినట్లు చెప్పారు.విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్ షిప్ లు, విద్యార్థి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిందని, ఇప్పటివరకు సుమారు లక్ష ఉద్యోగాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఉపాధ్యాయులు, నర్సులు, సింగరేణి, ఇతర ప్రభుత్వ సంస్థల్లో చేపట్టిన నియామకాలను కలిపి సుమారు లక్ష ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో మరో లక్ష ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.చెన్నూరులో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఐటీఐ ఉత్తీర్ణులైన సుమారు 100 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వారు A1, A2 స్థాయిలను పూర్తి చేశారని, తదుపరి B1, B2 స్థాయిలను పూర్తి చేసిన అనంతరం విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. మణుగూరు ప్రాంతంలో కూడా ఇదే తరహాలో నైపుణ్య, విదేశీ భాషా శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.మణుగూరు ప్రాంతంలో ఐటీసీ సంస్థతో సమన్వయం చేసుకుని సీఎస్ ఆర్ నిధులతో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. సుమారు 100 మంది యువతకు శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ మణుగూరు వంటి ఆదివాసీ ప్రాంతంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏటీసీ ఏర్పాటు కావడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. జపనీస్ వంటి విదేశీ భాషలను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. ఏటీసీ విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను అభినందించిన ఆయన, విద్యార్థుల సృజనాత్మకతను మరింత ప్రోత్సహించాలని కోరారు. ఐటీఐల్లో చదువుతున్న గిరిజన, పేద, కార్మిక కుటుంబాల పిల్లలకు నాణ్యమైన సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారి భవిష్యత్తును మెరుగుపరచవచ్చన్నారు.అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం ప్రధానంగా గిరిజన, ఏజెన్సీ ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతంలో గిరిజనులు, దళితులు, బీసీలు, పేద, బలహీన వర్గాల విద్యార్థులు అధికంగా ఉన్నారని చెప్పారు. మణుగూరులో సింగరేణి బొగ్గు గనులు, బీటీపీఎస్, అశ్వాపురంలోని భారజల కర్మాగారం, బూర్గంపాడులో ఐటీసీ పేపర్ బోర్డు, పాల్వంచలో నవభారత్, కేటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉన్నందున స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తే విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.మణుగూరు ఏటీసీలో 244 మంది, ఐటీఐలో 168 మంది, మొత్తం 412 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఏటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా అభినందన పత్రాలు అందజేశారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేందుకు మణుగూరు ఐటీఐ–ఏటీసీ వద్ద రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కోరారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మణుగూరు ప్రాంతం సుమారు 80 శాతం ఏజెన్సీ, షెడ్యూల్డ్ ఏరియా పరిధిలో ఉందన్నారు. అదే సమయంలో సింగరేణి, నవభారత్, ఐటీసీ వంటి పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఉన్నందున పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్ సంప్రదాయ కోర్సులతో పాటు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సిఎన్సి వంటి ఆధునిక సాంకేతిక కోర్సులకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు.విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమలతో సమన్వయం చేసుకుని ప్లేస్ మెంట్ అవకాశాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించి ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలు, పరిశ్రమల అవసరాలను అనుసంధానం చేసేందుకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ట, ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ సెంటర్స్ జాయింట్ డైరెక్టర్ నగేష్, టాంకం ఈవో గౌస్ పాషా, రతన్ టాటా ఆర్డిడి కోటేశ్వరరావు, ఏ టి సి కళాశాల ప్రిన్సిపాల్ సారంగపాణి, తహసిల్దార్ అద్దంకి నరేష్ ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- గౌడ సంఘం పెద్ద తాళ్ళపల్లి వెంకన్న గౌడ్ పిలుపు
- మర్కోడులో ఘనంగా 376వ జయంతి వేడుకలు



**ఆళ్ళపల్లి ఆగస్టు18 (ప్రజా జ్యోతి)** తెలంగాణ వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మర్కోడు గ్రామ పంచాయతీలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.గౌడ సంఘ పెద్దలు తాళ్లపల్లి వెంకన్న, యాసారపు బాబు, మాట్లాడుతూ.. మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ గడ్డపై స్వయంపాలనకు బాటలు వేసిన తొలి వీరుల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒకరని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణయ్య, పొదిల రాము, తాళ్లపల్లి రామ్మూర్తి, బూర్ణ రాంబాబు, తాళ్లపల్లి రమేష్, కాసబోయిన వెంకటేశ్వర్లు, కొంపెల్లి సాంబయ్య, కోరుకొప్పుల యాకయ్య, బత్తిని శ్రీను, తాళ్లపల్లి ఎల్లాగౌడ్, తాళ్లపల్లి రవి, తాళ్లపల్లి చిరంజీవి, వగలబోయిన సతీష్, రణం మల్లికార్జున్, తాళ్లపల్లి నవీన్, తాళ్లపల్లి సదయ్య, వగలబోయిన రాంబాబు, రణం శేఖర్, యాసారపు సతీష్, గుండు నరేందర్, తాళ్లపల్లి సుధాకర్, యాసారపు జనార్ధన్, తాళ్లపల్లి శ్రావణ్, తాళ్లపల్లి శేఖర్, బూర్ణ సతీష్, నవజీవన్ వినయ్, బూర్ణ రవి, సాగర్, నరేష్, వికాస్, కిరణ్, అన్వేష్, హరీష్, పవన్, అజిత్, కళ్యాణ్, సాయి, సాగర్, సంతోష్ తదితరులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఆలయ భూమిని స్వాధీనం చేసుకోవాలి



**చర్ల, ఆగస్టు 18 :(ప్రజా జ్యోతి):**శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయానికి చెందిన భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని ఆలయ కమిటీకి అప్పగించాలని చర్ల శివాలయం ఆలయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మహా రుద్రసేన వ్యవస్థాపకుడు కొండా చరణ్ ఆధ్వర్యంలో చర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ దైవ ప్రధాన సేవకుడు జవ్వాది రవి మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా ఆలయ కమిటీ పరిరక్షణలో ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని ఆరోపించారు. గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు.గతంలో తహసీల్దార్ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ అనంతరం అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.ఆలయ భూమిని పరిరక్షించేందుకు ఏడాదిన్నర కాలంగా వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అక్కడ పూజలు నిర్వహించేందుకు ఇబ్బందులు బెదిరింపులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.ఆలయ భూముల అంశాన్ని ప్రభుత్వం,రెవెన్యూ అధికారులు అత్యంత సీరియస్‌గా పరిగణించాలని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఆక్రమణలకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని ఆలయ కమిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దార్‌తో సమస్యపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సేవకులు పెందుర్తి ఆంజనేయులు, సిద్ధాంతి శ్రీను, నీలి ప్రసాద్, శ్యాం, గూడూరి కృష్ణమూర్తి, సత్యనారాయణ, సుజాత, కుమార్, కిషోర్, రాజేష్, ప్రమోద్, భాష, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**చర్ల, ఆగస్టు 18:(ప్రజా జ్యోతి):**విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అన్నారు. క్రమశిక్షణను అలవర్చుకోవడం ద్వారా చదువుతో పాటు జీవితంలోనూ విజయాలను సాధించవచ్చని సూచించారు. సర్పంచ్ భర్త, యువజన కాంగ్రెస్ నాయకుడు వల్లి శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రులు, 2003–2004 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయానికి మంగళవారం 50 కిలోల బియ్యం, 20 స్టీల్ ప్లేట్లు, పండ్లు, స్వీట్లు అందజేశారు.విద్యార్థి నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సామ్రాజ్యం మాట్లాడుతూ విద్యార్థులు ఇతర వ్యాపకాల వైపు దృష్టి మళ్లించకుండా విద్యపై ఏకాగ్రత పెట్టాలని ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడిన వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, కృషి ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు.గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సంస్థ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుని మంచి ఫలితాలు సాధించి సంస్థకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదన్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయం లేకుండా దాతల సహకారంతోనే విద్యార్థి నిలయాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు దాతల విశ్వాసాన్ని నిలబెట్టేలా కష్టపడి చదివి జీవితంలో స్థిరపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో వల్లి శ్రీకాంత్, పాసికంటి సంతోష్, బాజీ, గౌస్ పాషా, ఆలెం సతీష్, గంప మాణిక్యాలరావు, కొండేటి చంద్రశేఖర్, తూము రాము, తోకల నాగేంద్ర, చంద్రమౌళి, సాంబ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు 19న ఏజెన్సీ బంద్‌కు తుడుందెబ్బ పిలుపు

- ఆదివాసీ హక్కుల పరిరక్షణకు బంద్‌కు సహకరించాలని కుంజా వెంకటేష్ దొర విజ్ఞప్తి



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 19న బుధవారం ఏజెన్సీ బంద్ నిర్వహించనున్నట్లు అన్నపురెడ్డిపల్లి మండల తుడుందెబ్బ అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర తెలిపారు. పెంట్లం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగాల్లో న్యాయమైన రిజర్వేషన్ల అమలు కోసం బంద్ చేపడుతున్నట్లు తెలిపారు.పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో జీవో నంబర్ 109 ప్రకారం ఆదివాసీ అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా 6 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆయన అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని 29 శాఖల ఉద్యోగాలకు సంబంధించి జీవో నంబర్ 3తో పాటు ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి ఐటీడీఏల ద్వారా ఏజెన్సీ డీఎస్సీ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బంద్‌కు మండలంలోని ఆదివాసీ నిరుద్యోగులు, యువత, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో ఆదివాసీ నాయకులు మడివి నాగేంద్రబాబు, తాటి చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



**చర్ల, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):** చర్ల పోలీస్ క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్స్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్ల ఎస్‌హెచ్‌ఓ ఆలేం రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె. మహీధర్‌లు ఒలింపిక్ జెండాను ఊపి పరుగుపందెం పోటీలను ప్రారంభించారు.ఈ సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె. మహీధర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం మినహా ఇలాంటి సౌకర్యవంతమైన క్రీడా మైదానం మరెక్కడా లేదన్నారు. చర్లలో నిర్మించిన 400 మీటర్ల ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంతో అనువుగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి మైదానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన పోలీస్ శాఖ అధికారులు, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్‌లకు, సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీ ఈశ్వర్, శ్రీను, ఏఎస్ఓ పీడీ కె. వెంకటనారాయణ, జిల్లా అథ్లెటిక్స్ కోచ్‌లు నాగరాజు, ప్రసాద్, పీఈటీ రవీందర్‌తో పాటు పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.

## చేతిపంపు సమస్యకు తక్షణ పరిష్కారం

- సర్పంచ్ మందా నాగరాజు చొరవతో మరమ్మతులు



**బూర్గంపహాడ్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**మండల కేంద్రంలోని ఏజీహెచ్ఎస్ ఆశ్రమ పాఠశాల వద్ద పాడైన చేతిపంపు సమస్యకు సర్పంచ్ మందా నాగరాజు తక్షణ పరిష్కారం చూపించారు. చేతిపంపు పనిచేయకపోవడంతో విద్యార్థుల కు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని పాఠశాల వార్డెన్ పద్మావతి సోమవారం సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు.ఫిర్యాదుపై వెంటనే స్పందించిన సర్పంచ్ విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ మందా నాగరాజు వెంటనే స్పందించారు. సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి చేతిపంపును పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.ఈ మేరకు మంగళవారం పంచాయతీ సిబ్బంది చేతిపంపును పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టారు. అనంతరం చేతిపంపు తిరిగి పని చేయడంతో పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్య పరిష్కారమైంది.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఐ డి ఓ సి సమావేశ మందిరంలో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు




**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 18,(ప్రజా జ్యోతి)** స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు ,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్న జీవిత చరిత్రను పిల్లలు, భావితరాలకు తెలియజేయాలని, కులవృత్తులను ప్రోత్సహించాలని సూచించారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించండి

- ఎంపీ రఘురాం రెడ్డికి వినతిపత్రం సమర్పించిన నాయకులు.
- త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం : ఎంపీ హామీ



**పాల్వంచ, ఆగస్టు 18, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని వెంటనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డిని పలువురు నాయకులు కోరారు.మంగళవారం పాల్వంచ సంజయ్‌నగర్‌కు విచ్చేసిన ఎంపీ రఘురాం రెడ్డిని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చారుగుండ్ల వెంకటేశ్వర్లు, శనగ రామచందర్‌రావు, భూక్య శంకర్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు.జిల్లాకు గత విద్యా సంవత్సరంలోనే కేంద్రీయ విద్యాలయం మంజూరైనప్పటికీ, ఇప్పటివరకు విద్యాలయం ప్రారంభానికి నోచుకోలేదని వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్రీయ విద్యాలయం ఎంతో అవసరమని, తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టి పాఠశాలను ప్రారంభించాలని కోరారు.

### సింగరేణి స్థలం పరిశీలన //

వినతిపై ఎంపీ రఘురాం రెడ్డి సానుకూలంగా స్పందించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సింగరేణి పరిధిలో స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే అవసరమైన చర్యలు చేపట్టి విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొండం వెంకన్నగౌడ్, వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు



**దమ్మపేట, ఆగస్టు 18(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామానికి చెందిన దారబోయిన చందు తన భార్య జగదీశ్వరి గత నెల 09-07-2026 నుంచి కనిపించకుండా పోయిందని దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్య ఇంటి నుంచి వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి రాలేదని, కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.జగదీశ్వరి ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించినట్లు చందు తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆమెకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు దమ్మపేట పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## వ్యవసాయ పనులకు ఆటంకం.. మహిళపై దాడి

- ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసిన పోలీసులు

**దమ్మపేట, ఆగస్టు 18(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామానికి చెందిన కట్టబోయిన సుభాషిణి తన పొలంలో ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా అదే గ్రామానికి చెందిన కాజ సుకన్య, గొట్టిపాటి ఆదిలక్ష్మి తమ పొలంలోకి ప్రవేశించి ట్రాక్టర్‌ను అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తనను బూతులు తిడుతూ దాడి చేశారని, ఈ ఘటనలో తనతో పాటు ఉన్న వారిపై కూడా దాడికి పాల్పడ్డారని సుభాషిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా అకారణంగా ట్రాక్టర్‌ను అడ్డుకుని గొడవకు దిగడంతో పాటు దుర్భాషలాడి దాడి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదును స్వీకరించిన దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత ఏఐటీయూసీతోనే సాధ్యం

- సమిష్టి పోరాటాలతో చట్టబద్ధ హక్కులు సాధించుకుందాం.
- కార్మిక సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తాం: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**పాల్వంచ, ఆగస్టు 18, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతతో పాటు చట్టబద్ధంగా దక్కాల్సిన అన్ని హక్కులను సాధించేందుకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ పట్టణంలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, విద్యుత్, సివిల్, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సాధారణ సమావేశం మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం 'సీఆర్ భవన్'లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ.. ఎండ, వానలను లెక్కచేయకుండా నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులకు న్యాయబద్ధంగా రావాల్సిన వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.కార్మికుల వేతనాలు, హక్కులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధంగా కల్పించాల్సిన హక్కులను ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

### సంఘటిత పోరాటమే బలం ...

కార్మికులంతా సమిష్టిగా, సంఘటితంగా ఉద్యమించినప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సాబీర్ పాషా అన్నారు. హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎర్రజెండా నీడలో కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్మిక వర్గానికి సీపీఐ, ఏఐటీయూసీ ఎల్లవేళలా అండగా ఉంటాయని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, నాయకులు నామ పండు, నూనావత్ దినేష్, నామ నవీన్, నాగేశ్వరరావు, రమేష్, వెంకటేశ్వర్లు, గంగపురి వెంకన్న, మాడుగుల ప్రసాద్, శివరామకృష్ణ, ఉప్పుగండ్ల కృష్ణ, రంగయ్య, ముత్తమ్మ, సారమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ అవకాశాలు కల్పించండి

- మంత్రి వివేక్ వెంకటస్వామికి బహుజన ఐక్య వేదిక వినతి



**పాల్వంచ, ఆగస్టు 18, ప్రజాజ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్త పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ బహుజన ఐక్య వేదిక నాయకులు రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమలు, గనులు–భూగర్భశాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిని కోరారు.మణుగూరులోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు వెళ్తున్న మంత్రిని మంగళవారం పాల్వంచ సీ కాలనీ గేట్ వద్ద బహుజన ఐక్య వేదిక నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వేదిక ఆధ్వర్యంలో బూర్గుల విజయ్ భాస్కర్ నేతృత్వంలో నాయకులు మంత్రికి తమ సమస్యలను వివరించారు.

### మూతపడిన పరిశ్రమలతో పెరిగిన నిరుద్యోగం //

పారిశ్రామికంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏపీ స్టీల్, ఎన్ఎండీసీ, కేటీపీఎస్ పాత ప్లాంట్ తదితర పరిశ్రమలు మూతపడటం, ఉత్పత్తి కేంద్రాలు నిలిచిపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రతరమైందని నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు.స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాకు నూతన పరిశ్రమలను తీసుకువచ్చి, గత పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

### పారిశ్రామిక కారిడార్, ఆటోనగర్ ఏర్పాటు చేయాలి //

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పారిశ్రామిక కారిడార్, ఆటోనగర్ వంటి పరిశ్రమల సముదాయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేటీపీఎస్ ఏ, బీ స్టేషన్ల ఉత్పత్తి కాలం పూర్తికావడంతో తొలగించిన 710 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ప్రాంతంలో 2×800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా ఎన్ఎండీసీ ప్లాంట్‌ను, ఏపీ స్టీల్ పరిశ్రమను పునరుద్ధరిస్తే వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

### మౌలిక వసతులు అందుబాటులోనే ఉన్నాయి //

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు ఇప్పటికే ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉన్నాయని నాయకులు మంత్రికి వివరించారు. రవాణా, విద్యుత్, నీరు తదితర సదుపాయాలు అందుబాటులో ఉండటంతో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు నిర్మాణ వ్యయం కూడా తగ్గే అవకాశం ఉందన్నారు.ముందుగా మంత్రిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రికి బహూకరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం, కార్యదర్శి శనగ రామచందర్‌రావు, సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, మెంటం బలరాం, జూపూడి ప్రభాకర్, భూక్య శంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

- జై గౌడ నినాదాలతో డీజే పాటలు, నృత్యాలతో భారీ ర్యాలీ





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద గౌడ్ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, గౌడ్ నాయకులు, గౌడ్ సంఘం యువత ఆధ్వర్యంలో 200 మందికి పైగా సభ్యులతో గౌడ్ జెండాలు చేతబట్టి భారీ ర్యాలీ చేపట్టారు. డీజే పాటలకు యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, జై గౌడ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అన్నపురెడ్డిపల్లి నుంచి పెంట్లం గ్రామం వరకు ర్యాలీ కొనసాగింది. పెంట్లం గ్రామంలోని బీరయ్య ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తిరిగి అన్నపురెడ్డిపల్లి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పెద్దలు వనమా గాంధీ, ఎస్సై విజయసింహారెడ్డి పాల్గొని గౌడ్ సంఘం సభ్యులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీరుడిగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచి సామాజిక సమానత్వం కోసం పోరాటం సాగించారు. ప్రజలను సమీకరించి అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యమించిన ఆయన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు, గౌడ్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, వనమా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)

సమీకరించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని, దీనిపై నివేదిక సమర్పించి ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు.జిల్లాలో హెచ్ పీవీ వ్యాక్సినేషన్ 80 శాతం పూర్తయిందని, మిగిలిన అర్హులందరికీ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని అన్నారు. గుండాల ఘటనకు ఎవరు బాధ్యులో, ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో పూర్తి వివరాలతో డీఎంహెచ్ఓ 48 గంటల్లో కలెక్టర్ కు యాక్షన్ టేకన్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు.పనుల మంజూరు లేదా నిధులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, నిధుల కోసం తాము ప్రభుత్వ స్థాయిలో ఫాలోఅప్ చేస్తామని అన్నారు. అయితే పనులను పెండింగ్ లో ఉంచి కాలయాపన చేయవద్దని, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు వెంటనే త్రాగునీటి కనెక్షన్లు ఇవ్వాలని, అవసరమైన హ్యాండ్ పంపుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు, పైప్ లైన్ లకు ప్రతిపాదించిన పనుల ప్రస్తుత స్థితిపై నివేదిక సమర్పించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో త్రాగునీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని అందించాలని సూచించారు. గురుకులాలను సందర్శించిన సమయంలో మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు, గుడ్లు వంటి సరుకులు తగినంతగా లేవని గుర్తించినట్లు ఎంపీ తెలిపారు. టమాటాలను ఎలుకలు కొరికిన పరిస్థితిలో ఉన్నాయని, సరుకుల బ్యాగులు తెరిచి ఉంచారని, నిర్దేశించిన డైట్ లో 50 శాతం కూడా అమలు కావడం లేదని, మూడు రోజుల పాటు ఒకే కూర వడ్డించిన పరిస్థితిని గమనించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని గురుకులాలు, పాఠశాలల జాబితాను సిద్ధం చేసి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి వారం కనీసం ఐదు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందకపోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్టణ ప్రాంతాలకు పీఎంఏవై కింద మంజూరైన 1,590 ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సమర్పించాలని అన్నారు. పీఎంఏవై చెల్లింపులకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యాత్మక కేసుల వివరాలను ప్రత్యేకంగా నివేదించాలని సూచించారు. కొత్తగూడెం వంటి ముఖ్యమైన రైల్వే స్టేషన్ కు అమృత్ స్టేషన్ పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని, ఈ విషయాన్ని తాను రైల్వే మంత్రికి కూడా తెలియజేసినట్లు ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి మార్పిడి చేయడంతో పాటు భూమి విలువను కూడా చెల్లించినప్పటికీ, రెండేళ్లు గడిచినా రైల్వే భూమిని రాష్ట్రానికి అప్పగించలేదని తెలిపారు. అమృత్ పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అన్నారు. పైప్‌లైన్ పనుల్లో శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్లు వేసిన తర్వాత రహదారులను గతంలో ఉన్న విధంగానే పునరుద్ధరించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అనుమతుల కారణంగా విద్యుత్ లైన్లు, రహదారులు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీఎఫ్ఓలు స్థానిక ఎమ్మెల్యేలతో సమయం కేటాయించి సమస్యలను నమోదు చేసుకుని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవులను ధ్వంసం చేయాలని తాము కోరడం లేదని, అడవులను సంరక్షిస్తూనే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎంఆర్ఐ,






సీటీ స్కాన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని అన్నారు. ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మంత్రులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయి నుంచి సంపూర్ణ నివేదిక అందలేదని తెలిసిందని, అవసరమైన వైద్య పరికరాలు, ఇతర అవసరాలకు సంబంధించి సమగ్ర నివేదిక అందించాలని కోరారు. విద్య, వైద్యం, రైల్వేలు తదితర రంగాలకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి తాము నిరంతరం కేంద్ర మంత్రులతో ఫాలోఅప్ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖకు అవసరమైన నిధుల కోసం కూడా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని 124 ఐసోలేటెడ్ హ్యాబిటేషన్లకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్న నేపథ్యంలో రహదారులు, త్రాగునీరు, ఇతర మౌళిక వసతుల కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అన్నారు. ప్రతిపాదనలు లేకుండా కేంద్రం నుంచి నిధులు ఎలా తీసుకురాగలమని అన్నారు. అటవీ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పోడు రైతులు తమ పశువులను అడవిలోకి తీసుకెళ్లినప్పుడు రోజుల తరబడి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 44 సబ్ సెంటర్లు, 14 పీహెచ్‌సీలు, 3 సీహెచ్‌సీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించినట్లు చెప్పారు. గుండాలలో 5 పడకల డయాలసిస్ కేంద్రం మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీ క్రింద ఏజెన్సీ ప్రాంతాల్లో సిటీ స్కాన్ మంజూరు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. జిల్లాలో 124 ఐసోలేటెడ్ హ్యాబిటేషన్లు ఉన్నాయని, ప్రస్తుతం స్థానిక నీటి వనరుల ఆధారంగా సోలార్ వ్యవస్థల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. అటవీ అనుమతుల సమస్యల కారణంగా వాటికి శాశ్వత త్రాగునీటి సరఫరా కల్పించలేక పోతున్నామని వివరించారు. కొత్తగూడెం జిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద రూ.17 కోట్ల వేతన బకాయిలు, రూ.50 కోట్ల మెటీరియల్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇకపై దిశా సమావేశాలకు అటవీ, పోలీస్ శాఖల అధికారులు కూడా తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని కోరారు. వైద్య శాఖలో అధికారుల బాధ్యతలను స్పష్టంగా విభజించాలని సూచించారు. జిల్లాలో 116 మంది వైద్యులు, 52 మంది నర్సులు, 45 మంది పారామెడికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం మరింత మెరుగు పడాలని, ఆసుపత్రులు సక్రమంగా పనిచేయకపోతే దాని ప్రభావం ప్రజాప్రతినిధులపై కూడా పడుతుందని అన్నారు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందించాలని, వృద్ధుల లైవ్ అథెంటికేషన్ లో వేలి ముద్రలు పడకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను ఐరిస్ సాంకేతికతను వినియోగించి పరిష్కరించాలని కోరారు. రైల్వే స్టేషన్ పేరును 'భద్రాచలం రోడ్' నుంచి 'కొత్తగూడెం'గా మార్చేందుకు ఎంపీ ద్వారా అవసరమైన అభ్యర్థన లేఖ, ప్రతిపాదనను సమర్పించాలని కోరారు. అమృత్ పథకం క్రింద పైప్‌లైన్ పనుల సమయంలో దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించాలని, దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా వైద్య సిబ్బందిని బదిలీ చేయడం, డిప్యూటేషన్‌పై పంపడం చేయకూడదని అన్నారు. శివలింగాపురం పీహెచ్‌సీలో వైద్యులను బదిలీ చేయడంతో ప్రస్తుతం ఖాళీ ఏర్పడి అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. 100 పడకల ఆసుపత్రి ప్రస్తుతం బాగా పనిచేస్తోందని, అయితే ఇటీవల గడువు ముగిసిన సెలైన్ బాటిల్‌ను రోగికి అందించడం వల్ల పరిస్థితి విషమించిన ఘటన పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మేఘా కాంట్రాక్టర్‌కు సంబంధించిన ఓహెచ్ సిబ్బంది సమ్మె కారణంగా మూడు రోజుల పాటు త్రాగునీటి సరఫరా నిలిచి పోయిందని, దీనికి బాధ్యత ఎవరిదో పరిశీలించాలని కోరారు. నీటి సరఫరా మూడు రోజుల పాటు ఎందుకు నిలిచిపోయిందో, ప్రజలు రోడ్లపైకి వచ్చి సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో సమీక్షించాలని అన్నారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, గిరిజన ప్రాంతాల్లో కనెక్టివిటీ తక్కువగా ఉన్నందున గ్రామస్థాయిలో అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అమృత్ పథకం క్రింద మంజూరైన వాటర్ ట్యాంకులు, కొత్త పైప్‌లైన్ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని, క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అవసరమైన పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను ప్రతిపాదించి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో సీడీపీ మెషిన్, ఎక్స్‌రే, టిఫా స్కానింగ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇల్లందు పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉందని, ఇక్కడ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆసుపత్రుల అభివృద్ధిపై నిర్వహించే సమావేశాల్లో ప్రజాప్రతి నిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. తమకు సమాచారం లేకుండా వైద్య శాఖ సిబ్బందిని బదిలీ చేయకూడదని కోరారు. పీజీ వైద్యులను రిలీవ్ చేసే సమయంలో ప్రత్యామ్నాయ వైద్యుడిని ఏర్పాటు చేసిన తర్వాతే రిలీవ్ చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు, రహదారులు, కనీస మౌళిక వసతుల కల్పనకు అవసరమైన అటవీ అనుమతులు ఇవ్వాలని అన్నారు. అడవులను సంరక్షించడంతో పాటు గిరిజన ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు. అనంతరం జిల్లాలో ఇటీవల మరణించిన అటవీ శాఖ సిబ్బంది బానోత్ నవీన్ బీటీ ఆఫీసర్ కు దిశా సమావేశం ఒక నిమిషం మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్, ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్డిఓ విద్యా చందన, మునిసిపల్ చైర్ పర్సన్లు, దిశ కమిటీ సభ్యులు, సర్పంచ్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**దమ్మపేట, ఆగస్టు 18(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజుల నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రెండో పీఆర్సీని వర్తింపజేయాలని, జీవో నంబర్ 51ను సవరించాలని కోరారు.నిరసనకు ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కంటే కేశవ్ గౌడ్ మద్దతు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులను రెండో పీఆర్సీలో గుర్తించి వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.25 వేలకు తగ్గకుండా ఇవ్వాలని, గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆధార్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, విజయలక్ష్మి , భవాని, మల్లేశ్వరి, యశోద, పద్మతో పాటు గ్రామపంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

(మొదటి పేజీ తరువాయి...)



జారె ఆదినారాయణ నూతనంగా ఏర్పాటు చేసిన ఫోటో స్టూడియోను ప్రారంభించారు. అనంతరం ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లతో కలిసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ కేవలం వృత్తులు మాత్రమే కాదని, మన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలు, మధుర జ్ఞాపకాలను చిత్రాల రూపంలో భద్రపరిచి భవిష్యత్ తరాలకు అందించే విశిష్ట రంగాలని అన్నారు. ఒక ఫోటో ఒక సంఘటనను కళ్లకు కట్టినట్లు చూపిస్తే, ఒక వీడియో ఆ సంఘటనను పూర్తిస్థాయిలో మన కళ్లముందు నిలుపుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో జరిగే వివాహాలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రజల జీవితాల్లో చోటు చేసుకునే ప్రతి ముఖ్య సందర్భాన్ని చిత్రీకరించి భద్రపరచడంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాలు జీవనాధారంగా ఉన్నాయని తెలిపారు. కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ వృత్తిలో మరింత ముందుకు సాగాలని సూచించారు.దమ్మపేట మండలంలోని ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందరూ ఐక్యంగా ఉంటూ వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అసోసియేషన్ ప్రతినిధులకు, సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సిగ్గం వెంకటేశ్వరరావు, సర్పంచ్ సున్నం రుక్మిణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాముల ప్రసాద్, గుత్తా రాజా, బుద్దే కోటేశ్వరరావు, ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.